మారుమూల పల్లెలో పుట్టి పెరిగిన సుశీలకి ఆ వూరు వింత ప్రపంచంలా అద్భుతంగా కనబడింది. తనకు రానున్న అపద తెలుసుకో[illegible] అక్కడ వుండటం తన పూర్వజన్మ సుకృతంగా భావించింది.

తన అదృష్టానికి పొంగిపోయాడు వీర్రాజు. జున్ను ముక్కలాటి పడుచు చేతికి అందుబాటులో వుంది. సమయం కోసం వేచి వున్నాడు.



వచ్చిన వారంలోనే సుబ్బారావు కాంపు పని మీద పొరుగూరు వెళ్ళాడు.

వూరంతా బలాదూరు తిరిగి రాత్రికి యింటికి చేరాడు వీర్రాజు. తను పొందబోయే సుఖాన్ని తలుచుకుంటూ గుటకలు మింగుతున్నాడు. గేటు తీసుకుని కాంపౌండులోకి అడుగు పెట్టేసరికి కెవ్వుమన్న కేకతో ఒక్క పరుగున బయటకి వచ్చింది సుశీల. ఎదురుగా వున్న వీర్రాజుని కావలించుకుని "అన్నయ్యా! వాడు చూడు. నన్నల్లరి పెడుతున్నాడు." అంది గడగడ వణికిపోతూ.

ఆ సంబోధన అతని మనసుని తాకి వింత అనుభూతిని కలిగించింది. అతనిలోని మరో మనిషి మేల్కొన్నాడు. "ఎవడ్రాడు! దొంగనా కొడుకు! నా చెల్లెమ్మమీద చెయ్యేస్తావురా!" అని బూతులు తిడుతూ ఎడాపెడా కుమ్మేశాడు వాడిని. "మళ్ళీ ఎప్పుడైనా నా చెల్లెమ్మని కన్నెత్తి చూశావో, గొయ్యితీసి పాతేస్తాను. జాగ్రత్త" విసురుగా బయటకి తోశాడు ఆ కుర్రాడిని. యిదే సందని పరుగు లంకించుకున్నాడు ఆ కుర్రాడు.

భయంతో వణికిపోతూ గోడకి కరుచుకు పోయింది సుశీల. "అన్నయ్యా! సమయానికి నువ్వొచ్చావు. లేకపోతే నేనేమైపోయేదాన్నో." అని బావురుమంది.

"వూరుకోమ్మా! వూరుకో. నేనున్నాగా. నీకేం భయంలేదు, అంతగా అయితే బావొచ్చిం దాకా అమ్మ నీకు తోడు పడుకుంటుందిలే." అన్నాడు లాలించుతున్నట్లు.

ఆ గల్లంతుకు బయటకి వచ్చిన అన్ని వాటాల వాళ్ళూ అనుకోని సంఘటనకి 'ఆశ్చర్యంగా చూశారు. 'కలా! నిజమా!' అన్నట్లు.

—సరస్వతి

## ముష్టి

గుడిలోనుంచి బయటకు వచ్చింది వర్ధనమ్మ. మెట్ల ప్రక్కగా కూర్చుని వున్నారు బిక్షగాళ్ళు అనేకమంది. తమ చేతులలో వున్న గిన్నెలను ముందుకు చాచి "తల్లీ ధర్మం" అంటూ యాచిస్తున్నారు.

కుంటివాళ్ళు. గుడ్డివాళ్ళు. పసిపిల్లలు పండు ముసలివాళ్ళు అనేకమంది దరిద్రానికి వారసుల్లాగా కూర్చొని వున్నారు. వాళ్ళందరినీ చూస్తుంటే చెప్పలేని అసహ్యమూ. ఏవగింపు. కోపం కలిగాయి వర్ధనమ్మకు.

ఒక్కరికి కూడా ఒక్క పైసా ధర్మం చేయటం యిష్టం లేదామెకి.

"ముష్టి వెధవలు" అని మనస్సులో అను కొని వాళ్ళ ముఖం చూడడమే పాపం అన్నట్లుగా సాగిపోయింది ఆమె.

మెట్లచివరగా కూర్చొన్న రెండు కాళ్ళులేని ముసలివాడు "తల్లీ! రెండు కాళ్ళులేని ముసి లోణ్ని. దయతలచి పది పైసలు ధర్మం చేసి పుణ్యం కట్టుకోమ్మా" అని గిన్నెను ముందుకు చాచి ఆమె కాళ్ళకు దణ్ణం పెట్టబోయాడు.

తన కాళ్ళను తాకబోతున్న వాడి చేతులను చూసి పాముని చూసినట్టుగా భయపడింది వర్ధనమ్మ.



"యూ డర్టీ బెగ్గర్" అని వాడిని తిట్టి గబగబా మెట్లు దిగింది.

'అసలీ ముష్టి వెధవలనందరినీ కాల్చిపారేస్తే తప్ప యీ దేశం బాగుపడదు. ఎక్కడ పడితే అక్కడ తయారు వీళ్ళు' అని తిట్టుకుంది మనస్సులో.

"రిక్షా కావాలా అమ్మా" వర్ధనమ్మను చూస్తూనే అడిగాడు ఒక రిక్షావాడు.

"గాంధీ బొమ్మ దగ్గరికి ఏం తీసుకుంటావు?" అనడిగింది.

"మీకు తెలియనిదేటుందమ్మగారూ! రూపా యిప్పించండి" చెప్పాడు.

"రూపాయా? ఏమంత దూరముందని రూపాయి అడుగుతున్నావు? ముప్పావలా యిస్తాను" అన్నది.

"లేదండమ్మగారూ! కష్టం గమనించండి" ప్రాధేయపడ్డాడు రిక్షావాడు.

"తొంభై పైసలిస్తాను. వస్తేరా లేదంటే వెళ్ళు" నిక్కచ్చిగా చెప్పింది.

"సరే రండి" అని వాడు అనగానే రిక్షా ఎక్కి కూర్చొంది వర్ధనమ్మ.

గాంధీ బొమ్మ దగ్గర రిక్షా దిగి రూపాయి కాగితం వాడి చేతికిచ్చింది.

"దయ తలచండమ్మగారూ!" రూపాయి వుంచుకుంటానన్నట్టుగా ప్రాధేయపడ్డాడు.

"అదేం కుదరదు – పది పైసలివ్వు" దబా యించింది. "ముష్టాడి కేశాననుకుంటాను. ఉంచు కోండమ్మా" అని జేబులోనుంచి పది పైసలు తీసి వర్ధనమ్మ చేతిలో పడేశాడు రిక్షావాడు.

—పి. పుణ్యవతి

## మనసులోని మనసు

వరండాలో కూర్చుని వారపత్రిక చదువుతున్న నేను గేటు తీస్తున్న చప్పుడికి తల ఎత్తి చూసాను. ఎవరో ఒక అపరిచిత యువకుడు వస్తున్నాడు. నేను వెంటనే లేచి నిలబడి, "ఎవరు కావా లండి?" అని అడిగాను. "గది అద్దెకిస్తారని తెలిసి వచ్చానండి" అన్నాడతను. అతన్ని తీసుకెళ్ళి గది చూపాను. అద్దెంతో చెప్పాను. అన్నిటికి అతను తల సాంతం ఎత్తకుండానే తల ఊపుతున్నాడు. చాలా అమాయకుడిలా ఉన్నాడే పాపం అనుకుంటూ లోపలికి వెళ్ళిపోయాను.

*

రమణ గదిలోచేరి నెల దాటింది. ఈ నెల రోజులలో అతను ఇంట్లో వాళ్ళకు చేరువయ్యాడు.



మా తలిదండ్రులను తాను కూడా అమ్మ, నాన్న అని మాతోపాటే పిలుస్తున్నాడు. ఏం తోచనప్పుడు నేను కూడా అతని గదికెళ్ళి కావలసిన పుస్తకాలు తెచ్చుకుంటున్నాను.

*

ఒకరోజు అనుకోకుండా బజార్లో ఆలశ్యమైంది. బస్సు స్టాపులో వచ్చి నిలబడ్డాను. ఎంతసేపటికీ బస్సు రావటము లేదు. చుట్టూ కుర్రకారు గొడవ ఎక్కువైంది. అంతలో దూరంగా రమణ కనపడ్డాడు. నావైపు వీపు పెట్టి స్నేహితునితో మాట్లాడుతున్నట్లు ఉన్నాడు. 'హమ్మయ్య' అనుకొని, అతన్ని తోడు తీసుకొని యింటికెళ్దామనుకొని, వడివడిగా అటు నడిచాను. దగ్గరకెళ్ళి పేరు పెట్టి పిలుద్దామన్నంతలో, రమణ స్నేహితునితో మాట్లాడుతున్న మాటలు పెద్దగా వినపడుతున్నాయి. "నాకు గది అద్దెకిచ్చిన వాళ్ళమ్మాయి ఒకతుందిరా. ఈ మధ్యే లైనులో పడుతున్నట్టుంది. అప్పుడే అలా ముఖం పెట్టి చూడకురా. నిదానంగా నా వల్లో పడనీ – చెప్తా" అంతే। ఆ తర్వాత నాకింకేమీ వినపడలేదు. ఎలా రిక్షా ఎక్కి యింటికి చేరానో నాకే తెలీదు।

—ఇందు

## కీలకం

సిటీబస్సు ఆలస్యంగా రావడంవల్ల ఆరోజు ఆఫీసుకు చేరేసరికి కొంచెం లేటయింది. ఆఫీసు రూంలో అడుగు పెడుతుంటే మా హెడ్‌క్లార్కు స్వరం కొంచెం హెచ్చుస్థాయిలో విన్పించింది.

"మీ టైపింగ్‌లో ప్రతి లైనులోను తప్పులు వున్నాయి. స్పేసింగు కూడా సరిగ్గా లేదు. పై ఆఫీసుకు పంపే కాగితాలు యిలా టైపుచేస్తే కుదరదు." హె॥క్లా ధోరణి అత్తగారు, కొత్త కోడలు సంవాదం ఫక్కీలో ఉంది. ఆఫీసు రూంలోకి వెళ్ళగానే హె॥క్లా ఎదురుగా ఒక కొత్త అమ్మాయి నిల్చొని ఉంది. పాపం ఆ అమ్మాయి మొహం వెలవెల పాలిపోయింది. 'బహుశ కొత్తగా అప్పాయింటయిన సునంద యీమే కావచ్చు' అనుకొన్నాను.

నేను నా పని చేసుకొంటున్నాను. కాని, ఏదో అవ్యక్తమైన బాధపడ్డాను. బహుశ తోటి స్త్రీని, అందులోను కొత్తగా ఉద్యోగంలో చేరిన అమ్మాయిని కించపరచినందువల్ల కావచ్చు. మా హె॥క్లా మనస్తత్వం నాకు బోధపడలేదు. వయస్సు 30–35 ఏళ్ళకుమించి ఉండవు. చదువుకున్న భార్య ఉంది. ఎక్కడో ఉద్యోగం చేస్తోందని కూడా విన్నాను. సునంద మళ్ళీ టైపు

### మీ భాషాభివృద్ధికి

ఇక్కడ పది మాటలున్నాయి. అయితే, ఒకేలా వున్న రెండు మాటల్లోనూ ఏదో ఒకటే సరైనది. మీ ఉద్దేశంలో ఏది రైటు అనుకుంటారో ఓ కాగితం మీద రాసుకోండి. అన్నీ అయిన తర్వాత, ఇక్కడే వున్న 'సమాధానం'తో మీ సమాధానాల్ని సరి చూసుకోండి. అన్ని రైటే అయితే, మీకు మీ మాతృభాషలో బాగా ప్రవేశం వున్నదన్నమాటే. ఐదు తప్పులు వచ్చాయనుకోండి—మీరు మరి, బాగా కృషి చెయ్యాలన్నమాట।

| | | |
|---|---|---|
| 1. | దిస | దిశ |
| 2. | నేరస్థుడు | నేరస్తుడు |
| 3. | శ్రేష్టము | శ్రేష్ఠము |
| 4. | సమష్టి | సమిష్ఠి |
| 5. | సరుకు | సరకు |
| 6. | వ్యవస్త | వ్యవస్థ |
| 7. | సౌష్టవము | సౌష్ఠవము |
| 8. | శంఖు | శంకు |
| 9. | ధ్రువము | ధృవము |
| 10. | భాష్పము | బాష్పము |

సమాధానాలు: 1. దిశ 2. నేరస్థుడు 3. శ్రేష్ఠము 4. సమష్టి 5. సరకు 6. వ్యవస్థ 7. సౌష్ఠవము 8. శంఖు 9. ధ్రువము 10. బాష్పము



చేసిన కాగితాలు తీసుకొని వెళ్ళి చూపించింది. కాని హె॥క్లా ముఖంలో సంతృప్తి కనిపించలేదు.

"ఉద్యోగంలో కొత్తగా జాయినయ్యారు కనుక తన అధికారం చూపడం కొరకు హె॥క్లా అలా మాట్లాడి వుంటారు. మీరేమీ బాధపడకండి" అన్నాను కాస్త ఓదార్పుగా, లంచ్ టైంలో సునందతో పరిచయం చేసుకొన్నాక.

"చూడండి, నా వర్కులో లోపాలు చూపినందుకు నేను బాధపడలేదు. కాని ఉద్యోగంలో యీ రోజునే చేరిన నేను మీకందరికీ యీ విధంగా పరిచయం అయినందుకే బాధపడుతున్నాను" సునంద ముఖంలో జాలి గోచరించింది. వెంటనే ఓ చిరునవ్వు నవ్వి టాపిక్ మార్చింది. నేను స్థాణువునై పోయాను సునంద హుందాతనానికి.

హె॥క్లాతో ఏదో ఫైలు డిస్కస్ చేస్తూ, టేబిల్‌మీద సునంద టైపు చేసిన కాగితాలు చూచాను. హె॥క్లా చెప్పింది కరక్టే. సునందకు టైపింగ్‌లో అనుభవం తక్కువ. మర్నాడు సునంద మామూలుగానే టైపు చేసింది. హె॥క్లా బయటినుంచి వచ్చిన ఫోనుకాల్సు, ఆఫీసరు ఇంటర్‌కమ్ ఇనస్ట్రక్షన్సుతో చాలా బిజీగా ఉన్నారు. సాయంత్రం ఇంటికి వెళ్ళేముందు హె॥క్లా సునందను పిలిచి, సబార్డినేట్ ఆఫీసెస్‌కు వెళ్ళే కాగితాలు టైపు చేయమని, నెమ్మదిగా పని నేర్చుకోమనీ నవ్వుతూ చెప్పారు. హె॥క్లా ముఖంలో ముందురోజు విసుగు స్థానంలో ప్రసన్నత చోటు చేసుకొంది. నేను రెండోసారి ఆశ్చర్యపోయాను హె॥క్లా మనస్తత్వంలో మార్పుకు.

ఇంటి వెళ్ళిపోతుంటే మా మెసెంజరు చెప్పాడు—సునంద ఇంకో పెద్ద ఆఫీసులోని సూపరింటెండెంటుగారమ్మాయని। మా హెడ్‌క్లార్కు భార్య ఆయన దగ్గర గుమస్తా।

—పప్పు సత్యవాణి